## క్లుప్తంగా

### చారిత్రక వాస్తవాలు వెల్లడించాలి



దుగ్గిరాల: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతాయుత స్థానంలో ఉన్న పవన్ కళ్యాణ్ హరిహరవీరమల్లు పేరుతో చారిత్రక వాస్తవాలను వక్రీకరించి సినిమా తీయడం శోచనీయమని వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకుడు షేక్ సుభాని పేర్కొన్నారు. గురువారం దుగ్గిరాల మీడియాతో ఆయన మాట్లాడుతూ కట్టు కథతో సోదరులు వలే కలిసి మెలిసి ఉంటున్న హిందూ ముస్లింల మధ్య అపోహలు పెంచేలా చిత్ర కథాంశం ఉండటం సరైంది కాదన్నారు. చారిత్రక ఆధారాలు లేని కాల్పనిక కథ హరిహరవీరమల్లు అని తెలిపారు. చిత్రంలోని అభూత కల్పనలపై పవన్ కళ్యాణ్ స్పందించి చారిత్రక వాస్తవాలు ప్రజలకు వెల్లడించాలన్నారు.

### పంచాయతీరాజ్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ

దుగ్గిరాల: గ్రామ పంచాయతీలు ఆదాయాన్ని పెంచుకోవాలని పంచాయతీ రాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణ తేజ సూచించారు. దుగ్గిరాల గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో ఇంటి పన్నుల డేటా ఎంట్రీలను తనిఖీ చేశారు. పంచాయతీ ఆదాయాన్ని పెంచాలని గ్రామ సర్పంచ్ ఖుషి భాయ్, ఈఓ వివేకానందలకు సూచించారు. ఇంటి పన్నులను ఆగస్టు 10వ తేదీలోపు వసూలు చేసి తన కార్యాలయానికి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

### పొగాకు ఉత్పత్తులతో ఫ్లోరోసిస్

జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణాధికారి గిరిధర్ కుమార్



ఫిరంగిపురం: పొగాకు ఉత్పత్తులు ఎక్కువగా వాడటం ద్వారాకూడా ఫ్లోరోసిస్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణాధికారి డాక్టర్ గిరిధర్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జెండాచెట్టు సెంటర్లోని ఉర్దూ పాఠశాలలో గురువారం ఫ్లోరోసిస్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గిరిధర్ కుమార్ మాట్లాడుతూ బోరు నీటిని వాడుతున్న ప్రాంతాల్లో కూడా ఫ్లోరోసిస్ వ్యాధి వస్తుందని చెప్పారు. బ్లాక్ టీ, బ్లాక్ సాల్ట్‌వంటివి ఎక్కువగా తీసుకోవడం ద్వారాకూడా ఈవ్యాధి సోకే ప్రమాదం ఉందన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధిరాకుండా చూసుకోవచ్చని తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ గోవర్ధన్, ఏఎన్ఎం భారతీ జ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### కార్మికుల సమస్యకు త్వరలో పరిష్కారం



తాడేపల్లిరూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్య త్వరలో పరిష్కారం కానుందని సీఐటీయూ నాయకుడు వేముల దుర్గారావు అన్నారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను కార్మిక నాయకులు కె.స్టీవెన్, కె.ఆదినారాయణలతో కలసి సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసలు యజమాని ఏసీసీ ముంబయి వారని, 1990లో చేసిన పొరపాటు వలన హెచ్ఎంపీ అనే కలకత్తా కంపెనీ సమస్యలను సృష్టించిందన్నారు. 32 సంవత్సరాలుగా కార్మికులు చేస్తున్న పోరాటానికి త్వరలోనే పరిష్కారం జరగనుందని తెలిపారు. నాయకులు సుభాని, గంగాధర్, సుబ్బారావు, కార్మికులు ఇమాంబీ, రమాదేవి, శారమ్మ, భూలక్ష్మి, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగ విరమణ సభ



దుగ్గిరాల: దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు పి.వసంతలక్ష్మి ఉద్యోగ విరమణ సభ గురువారం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం మన్నవ జయరత్న రాణి, ఉపాధ్యాయులు వసంతలక్ష్మి దంపతులను పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అధ్వానం.. కూలేందుకు సిద్ధం

- శిథిలావస్థకు చేరిన కాజ వద్ద గుంటూరు ఛానల్ వంతెన
- తూటికాడతో నిండిన కాల్వ.. పారుదల కాని నీరు
- పట్టించుకోని అధికారులు.. ఆందోళనలో రైతులు, ప్రజలు



శిథిలావస్థకు చేరిన కాజలోని గుంటూరు ఛానల్ వంతెన

మంగళగిరి: గుంటూరు, మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు ఐదు మండలాలకు సాగు, తాగునీటి సరఫరా చేస్తున్న గుంటూరు ఛానల్ ఆధునికీకరణను ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ప్రజలు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు ఛానల్‌పై వున్న వంతెనలు శిథిలావస్థకు చేరడంతో పాటు ఛానల్ పూర్తిగా తూటికాడ పెరిగిపోవడంతో నీరు ముందుకు సాగడం లేదు. ప్రకాశం బ్యారేజీ నుంచి గుంటూరు ఛానల్ ద్వారా మంగళగిరి – తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్, పెదకాకాని, గుంటూరు కార్పొరేషన్, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు మండలాలకు తాగునీటితో పాటు సాగు నీరు అందుతుంది. ఈ కాలువ కింద వరి, మిరప, పత్తి పంటలు అధికంగా సాగు చేస్తుంటారు. ప్రకాశం బ్యారేజీ నుంచి 4 టీఎంసీల నీరు సరఫరా అవుతుండగా 3.2 టీఎంసీలు నీటిపారుదలకు, 1.42 టీఎంసీల నీటిని తాగునీటికి వినియోగిస్తున్నారు. ఐదు మండలాల్లో 33 గ్రామాలలో 38 గ్రామాలలోని ట్యాంకులకు తాగునీరు సరఫరా అవుతుంది.



తూటికాడతో నిండిన గుంటూరు ఛానల్

**కూలేందుకు సిద్ధంగా..**

గుంటూరు ఛానల్‌పై కాజ – నంబూరు మధ్య గల వంతెన పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరి, ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇక ఛానల్‌లో పూర్తిగా తూటికాడ పెరిగిపోయి నీరు ముందుకు సాగడం లేదు. ఈ వంతెన ఏమాత్రం కూలినా సాగు నీటికే కాక తాగునీటికి తీవ్ర కొరత తప్పదని స్థానికంగా ఆందోళన వ్యక్తమవుతోంది. తూటికాడ మరింత పెరిగితే అంతంత మాత్రం పారుతున్న నీటి పూర్తిగా నిలిచిపోయే ప్రమాదముందని వెంటనే ప్రభుత్వం గుంటూరు ఛానల్‌పై శిథిలావస్థకు చేరిన వంతెనల స్థానంలో నూతన వంతెనల నిర్మాణం చేయడంతో పాటు తూటి కాడ తొలగించి నీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.

# మోసం.. బాబు నైజం

- ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు అలవాటే..
- ఎప్పుడు అధికారంలో వున్నా ఇదే తంతు
- ఎన్నికలకు ముందు మొసలి కన్నీళ్లు .. గట్టెక్కిన తరువాత వెన్నుపోటు
- వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి
- తాడేపల్లిలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' సభ



కార్యక్రమంలో క్యూ ఆర్ కోడ్ పత్రాలు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిరూరల్: నారా చంద్రబాబు నాయుడు ఎప్పుడు ముఖ్యమంత్రి అయినా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తారన్న విషయం మరోసారి రుజువైందని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) అన్నారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి అధ్యక్షత జరిగిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో దొంతిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు మొసలి కన్నీరు కార్చి ప్రజల్ని మోసం చేశారని అన్నారు. ఎప్పుడు ఎన్నికల్లో పోటీచేసినా ఏదో ఒక పార్టీ మద్దతుతో కల్లబొల్లి కబుర్లు చెప్పడం.. గెలిచిన తరువాత ప్రజల్ని మర్చిపోవడం ఆయన నైజమన్నారు.

**ఏడాదిలోనే తీవ్ర వ్యతిరేకత..**

మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు అతి తక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు చేసి, ప్రజలపై విద్యుత్ భారం లేకుండా చేస్తే.. నేడు చంద్రబాబు విద్యుత్ పేరుతో రాష్ట్రాన్ని దోచుకుంటున్నారన్నారు. సూపర్‌సిక్స్ పేరుతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాల కన్నా ఎక్కువ లబ్ధి చేకూరుస్తామని ఇంటింటికీ తిరిగి కూటమి నాయకుల ఫొటోలు వేసుకుని బాండ్లు పంపిణీ చేశారని, ఆ బాండ్లలో వున్న అంశాలను ఎవరైనా ప్రశ్నిస్తే, ప్రశ్నించిన వారిపై అసత్య ప్రచారాలు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి నాయకులు, కార్యకర్తలు సంవత్సర కాలం పూర్తయిన తరువాత ప్రజల్లోకి వెళుతుంటే ప్రజలు హామీలు అమలు చేయండని నిలదీస్తున్నారని అన్నారు. ఆ పార్టీల గెలుపుకోసం అహర్నిశలు కష్టపడ్డ కార్యకర్తలు కూడా ఇప్పుడు ముఖం చాటేసి తిరుగుతున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. సంవత్సర కాలంలోనే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, దానిని కప్పిపుచ్చుకునేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అనంతరం చంద్రబాబు నాయుడు మోసాలపై క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఈదుల మూడి డేవిడ్ రాజు, రాష్ట్ర సోషల్ మీడియా విభాగం కార్యదర్శి జావిద్, పట్టణ ఉపాధ్యక్షులు వేల్పుల ఎలీషా, పెదగాలయ్య, పట్టణ కార్యదర్శులు స్నేహసంధ్య, చిన్నపోతుల దుర్గారావు, పట్టణ విభాగ అధ్యక్షురాలు దర్శి విజయశ్రీ, పార్టీ పట్టణ సభ్యులు పుష్పరాజ్, స్థానిక నాయకులు యాకోబు, ఆలీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు స్వీట్లు పంపిణీ



స్వీట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడికొండ: కార్మికులంతా ఏకమై రాజధాని సామాజిక పింఛను రూ.5వేలు సాధించుకోవడం హర్షణీయమని సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం.రవి అన్నారు. గురువారం తుళ్లూరులో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు పోరాటాల అనంతరం ఆగస్టు 1న రాజధాని పారిశుద్ధ్య కార్మికులకు సామాజిక పింఛను రూ.5వేలు సాధించుకోవడం హర్షణీయమన్నారు. పారిశుద్ధ్య కార్మికులతోపాటు, అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టులో పనిచేస్తున్న హౌస్‌కీపింగ్, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లకు కూడా ఇది వర్తిస్తుందన్నారు. గతంలో నిలిపివేసిన సామాజిక పింఛను 121 జీఓ ద్వారా పునరుద్ధరించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్మికులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. జనవరి నుంచి ప్రభుత్వం పెంచిన పింఛను ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు ఏడు నెలల పెన్షన్ బకాయిలు ఒకేసారి చెల్లించాలని కోరారు. పారిశుద్ధ్య కార్మిక సంఘం నాయకులు కె.గోపిరాజు, ఎస్.స్వప్నదేవి, బుజ్జి, వీరమ్మ, రజిని, కోటేశ్వరరావు, మేరి, నాగమణి, సీఐటీయూ నాయకులు పేరం బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

### వీధి లైట్లు ఏర్పాటు చేయాలని వినతి

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ కమిషనర్ అలీమ్ బాషాకు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి నాయకులు మాట్లాడుతూ మంగళగిరి రూరల్ పరిధిలోని ఆత్మకూరు గ్రామంలో లూథరన్ చర్చి నుంచి పాలడుగు కోటేశ్వరరావు ఇంటి వరకు విద్యుత్ వీధి స్తంభాలు, వీధి లైట్లను ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశామని తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, నాయకులు పంతగాని దాసు, జాలాది విజయేంద్రరావు, గుర్రంకొండ సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

### పెన్షన్ల పునరుద్ధరణకు వినతి

తాడేపల్లిరూరల్: మంగళగిరి రూరల్ పరిధిలోని యర్రబాలెం ఒకటో సచివాయంలో పారిశుద్ధ్య కార్మికులకు, ఆశాలకు, అంగన్‌వాడీలకు, రాజధాని రైతు కూలీలకు, వింతంతువులకు పెన్షన్లు మంజూరు చేయాలని కోరుతూ టీడీపీ నాయకుడు ఆకుల ఉమామహేశ్వరరావు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కొన్ని సాంకేతిక కారణాల వల్ల కొంత మందికి పింఛన్లు పునరుద్ధరణ కాలేదని, వారికి కూడా వీలైనంత త్వరితగతిన పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. నాయకులు నీలం అంకారావు, ఆకుల పానకాల రావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: పట్టణ పరిధిలోని కొన్ని ప్రాంతాలలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈ సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సీతారామకోవెల, దిగుడుబావి, అన్నపూర్ణ థియేటర్ ఏరియా, పాత మంగళగిరి, ఎన్ఆర్ఐ జంక్షన్ ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మేడికొండూరు: మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు మండల విద్యుత్ శాఖ అధికారి పుల్లారెడ్డి తెలిపారు. మండలంలోని సిరిపురం విద్యుత్ లైన్ ప్రధాన మార్గాలలో హై ఓల్టేజ్ విద్యుత్తు లైను 30 కేవీ ఏర్పాటు చేయనున్న దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పాలడుగు, పొట్లపాడు, వెలవర్తిపాడు, సిరిపురం, మందపాడు, గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ప్రజలు సహకరించాలని తెలిపారు.

### వాహనాల తనిఖీ



దుగ్గిరాల: దుగ్గిరాల లాకుల వద్ద గురువారం సాయంత్రం ట్రైనింగ్ ఎస్ఐ హర్ష ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ద్విచక్ర వాహనచోదకులు, ఆటో డ్రైవర్ల లైసెన్సులు, వాహన పత్రాలు పరిశీలించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావు లబ్ధిదారులకు గురువారం అందజేశారు. తాడేపల్లి 4వ వార్డుకి చెందిన పులి రమేష్‌కు రూ. 10,350, తాడేపల్లి బ్రహ్మానందపురానికి చెందిన మహమ్మద్ షాజిద్‌కి రూ. 58,500ల చెక్కులను అందజేశామని తెలిపారు.

### మహిళలకు దుప్పట్లు పంపిణీ

తెనాలి, తెనాలి అర్బన్: పట్టణంలోని జై భీమ్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో పలువురి మహిళలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కటివరపు దేవయ్య సతీమణి దయామణి 8వ వర్ధంతి సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో జిలుగు పీటర్, శ్రీనివాస్, ఆశా, జై భీమ్ ఫెడరేషన్ టౌన్ అధ్యక్షులు గోవా కుమార్, ఎంపీటీసీ పేరం అరుణ ఉన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ అబ్రహం లింకన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

### పౌర హక్కులకు భంగం కలిగించకూడదు



తాడికొండ: పౌర హక్కులకు భంగం వాటిల్లకుండా సమాజంలో ఉన్నతంగా జీవించాలని తాడికొండ తహసీల్దారు మెహర్‌కుమార్ అన్నారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా తాడికొండలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పౌర హక్కులనేవి ప్రతి ఒక్క పౌరునికి సహజంగా లభించేవన్నారు. ప్రతి వ్యక్తి స్వేచ్ఛగా జీవించే హక్కు కలిగి ఉంటారన్నారు. మతం, లింగ, జాతి వివక్ష చూపకూడదన్నారు. ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయొచ్చన్నారు. శాంతియుత నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరూ కలిగి ఉంటారన్నారు. ఎస్ఐ జోజి మాట్లాడుతూ దేశంలో పౌర హక్కుల పరిరక్షణ పలు చట్టాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయం ఈఓ చంద్రశేఖర్, ఆర్ఐ హనుమంతరావు, వీఆర్వో మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణతోనే డెంగీ నిర్మూలన



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది

తాడేపల్లిరూరల్/మంగళగిరి: దోమల నివారణతోనే డెంగీ నిర్మూలన సాధ్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కె.విజయలక్ష్మి అన్నారు. జాతీయ డెంగీ నివారణ మాసోత్సవం ముగింపు సందర్భంగా గురువారం మంగళగిరి పట్టణ పరిధిలోని ఎంపీడీఓ కార్యాలయం నుంచి తెనాలి రోడ్డు వరకు నిర్మలా ఫార్మసీ విద్యార్థులతో కలసి ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్ఓ కె. విజయలక్ష్మి మాట్లాడుతూ దోమ కుట్టడం వలన డెంగీ జ్వరం వస్తుందని, ప్రతి ఒక్కరు దోమతెరలను వాడాలని సూచించారు. డెంగీ లక్షణాలు కనిపిస్తే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని సూచించారు. జిల్లా మలేరియా అధికారి కె.సుబ్బరాయణం, ఏఎంఓ రాజు నాయక్, ఇందిరానగర్ మార్కండేయ కాలనీ వైద్యాధికారులు పి. అనూష, సతీష్, నిర్మల ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రేఖా నరేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## సునామీ సన్నద్ధతపై మాక్ ఎక్సర్‌సైజ్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాక్ ఎక్సర్‌సైజ్‌ను వివరిస్తున్న వెంకట్ దీపక్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయంలో గురువారం సునామీ సన్నద్ధతపై మాక్ ఎక్సర్‌సైజ్ కార్యక్రమం నిర్వహించారు. విపత్తు నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట్‌దీపక్, మాట్లాడుతూ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ, ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్, ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సునామీ సన్నద్ధతపై 12 కోస్తా జిల్లాలోని ప్రభావిత మండల, గ్రామస్థాయి అధికారులతో మాక్ ఎక్సర్‌సైజ్ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించామని తెలిపారు. సునామీ, తుఫాన్ల పట్ల అధికారులు సంసిద్ధంగా ఉండాలని, ఎస్ఓపీ అమలు చేయడం, అందుబాటులోని వనరులు, సౌకర్యాలు, సాంకేతికతను ముందుగానే తెలుసుకోవడం వలన ప్రమాద స్థాయిని తగ్గించవచ్చని తెలిపారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ జిల్లా అధికారులకు సునామీ హెచ్చరికలు జారీ చేసే విధానం, మండల స్థాయి అధికారులకు సమాచారం చేరవేయడం ప్రత్యక్షంగా చూపించామన్నారు. జిల్లా అధికారులు, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్, ప్రభుత్వ లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలను దారుణంగా వంచించారు

**మూడు గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ సభలు**

దుగ్గిరాల: ఓట్లు వేయించుకొని ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కూటమి నేతలు ప్రజలను దారుణంగా వంచించారని దుగ్గిరాల జట్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ పేర్కొన్నారు. గురువారం దుగ్గిరాల మండలంలోని తుమ్మపూడి, రేవేంద్రపాడు, వీర్లపాలెం గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. దాసరి అరుణ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా ప్రభుత్వ హామీలు నెరవేర్చలేదన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన పరిపాలన కాలంలో కరోనా క్లిష్ట పరిస్థితుల్లో సైతం ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేసి, ప్రజలచేత మన్ననలు పొందారని తెలిపారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల్లో ఏ ఒక్కటీ ఇంతవరకు సక్రమంగా అమలు చేసిన పాపాన పోలేదన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు టి.శివగోపయ్య, ఎ.ధనుంజయ్, మైనార్టీ జిల్లా నాయకులు షేక్.జాని బాషా, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు పి.సంసోనమ్మ, గ్రామ ఉపాధ్యక్షుడు బి.రమేష్, గ్రామ అధ్యక్షులు పి.పృథ్వీరాజు, బి.యువరాజు, ఎస్.తిరుమల రావు, కె.హృదయరాజు, సుధాకర్, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 9న కార్మికుల 'టూల్ డౌన్'



సమావేశంలో మాట్లాడుతున్న పోరుమామిళ్ల సుబ్బరాయుడు

తాడేపల్లిరూరల్: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈనెల 9వ తేదీన టూల్ డౌన్ నిర్వహించనున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు స్పష్టం చేశారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆసుల రంగనాయకుల అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పోరుమామిళ్ల మాట్లాడుతూ రాష్ట్రంలోని మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగ కార్మికుల వేతనాలను జీవో నెం. 36 ప్రకారం చెల్లించాలని, మున్సిపల్ ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ పారిశుద్ధ్య కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన, రిటైర్ అయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు పనులు కల్పించాలని కోరుతూ 18న సమ్మె నోటీసును అందజేయనున్నామని తెలిపారు. రెగ్యులర్ ఉద్యోగ, కార్మికులకు పెండింగ్ బకాయిలపైన రాష్ట్ర ముఖ్యమంత్రి గానీ, మున్సిపల్ శాఖ మంత్రి గానీ నోరు మెదపకుండా ఉండడం అన్యాయమన్నారు. 6న ఉద్యోగ, కార్మిక సంఘాలు రాష్ట్రమంతా రౌండ్ టేబుల్ సమావేశాలు జరిపి మద్దతు కూడగతామని, 9న క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో పనిముట్లను పక్కన పెట్టనున్నామని తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ఉప ప్రధాన కార్యదర్శులు రావులపల్లి రవీంద్రనాథ్, శీలం వెంకట సుబ్బయ్య, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులు పులగం మద్దిలేటి, భజేంత్రి శ్రీనివాస్, కార్యదర్శి సత్యనారాయణ, సమితి సభ్యులు అంకయ్య, ప్రతాప్, విఘ్నేష్, చిత్తరంజన్, శ్రీనివాసులు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

### స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆపాలి

దుగ్గిరాల: విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెంటనే ఆపాలని సీపీఎం కార్మిక నాయకుడు జెట్టి బాల రాజు డిమాండ్ చేశారు. గురువారం దుగ్గిరాలలోని సెంట్రల్ వేర్ హౌస్ ముఠాకూలీలకు కరపత్రాలు పంచి అనంతరం బాల రాజు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజలపై పెద్ద ఎత్తున విద్యుత్ భారాలను మోపుతుందని ఇది అన్యాయమన్నారు. వెంటనే విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని, లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో మరియదాసు, పున్నారావు, యలమంద, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

### హిందూ శ్మశాన వాటిక నిర్మాణానికి శంకుస్థాపన

దావులూరు(కొల్లిపర): మండల పరిధి దావులూరు గ్రామంలోని హిందూ శ్మశాన వాటిక నిర్మాణ పనుల శంకుస్థాపనను గురువారం గ్రామంలోని పెద్దలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అంబటి సంధ్యారాణి మాట్లాడుతూ.. హిందూ శ్మశాన వాటిక నిర్మాణానికి గుంటూరు, కృష్ణా జిల్లాల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రోద్బలంతో జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినా సహకారంతో జెడ్పీజీఎఫ్ నిధుల నుంచి సుమారు రూ.8 లక్షలతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల యువత అధ్యక్షులు కోట మార్కండేయులు, ఎంపీటీసీ అద్దంకి బోసుబాబు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

### బహిరంగ ప్రకటన

నా క్లయింట్లు అయిన గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, కొల్లూరు గ్రామం, డోరు నెం.3-196వ నివాసస్తులు కొన్నాదుల (లేటు) తిరుపతిరావు గారి సంతతి 1) కొన్నాదుల వేణుగోపాల్, 2) కొన్నాదుల రమేష్ బాబు, 3) సుందం మురళీకృష్ణ గారి భార్య సుందం సరస్వతి, 4) లేటు గోలి మల్లేశ్వరి గారి కుమార్తె ఐంచారు లక్ష్మీశైలజ అనువారలు ది.05-07-2025వ తేదీన వారి నివాసం నుండి తాడేపల్లి సెంటు చర్చి దగ్గర జిరాక్సు తీయించు నిమిత్తం ఆటోలో వెళుచుండగా మార్గమధ్యమున వారి చేతిలోని నుండి జారి పడిపోయినది. అందులో వారి తండ్రిగారైన కొన్నాదుల తిరుపతిరావు గారి తాలూకు గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకం, నెం.5278/2008రుగా రిజిస్ట్రీ కాబడిన ఒరిజినల్ విక్రయ దస్తావేజు, మరికొన్ని కాగితములు కలిగిన కవర్ ఉన్నది. వెంటనే పరిసర ప్రాంతములో వెతకగా ఎక్కడా కనపడలేదు. కావున ఎవరికైనా దస్తావేజు కనపడిన యెడల వాటిగానీ, నా క్లయింట్లకుగానీ తెలియపరచినచో తగిన పారితోషికం ఇవ్వబడును. వాటిని ఎవ్వరైనా దుర్వినియోగపరచినచో చట్టప్రకారం చర్యలు తీసుకొనబడునని, సదరు దస్తావేజును ఎవరికిని తాకట్టు పెట్టుట గానీ, అన్యాక్రాంతములు చేయుటగానీ జరిగియుండలేదని ఇందుమూలముగా తెలియజేయుచున్నాను.

పి. వరుణ్ కుమార్, న్యాయవాది
సెల్ నెం. 9966124584